**కథ**

# ఇల్లాలి మనసు

**"నీరూ ఇంకా తెల్లారలేదా నీకు లే..లేచి చదువుకో" వంటింట్లోంచి అరుస్తోంది సుమిత్ర.**

**బెడ్‌రూంలో డబుల్ కాట్ మీద సుషుప్తికీ, చేతనావస్థకీ మధ్యనున్న నీరజకి తల్లి అరుపులు లీలగా వినిపిస్తున్నాయి. లేవాలని ప్రయత్నించింది కానీ నిద్ర బరువుతో కనురెప్పలు మూసుకుపోతున్నాయి.**

''ఐదింటికి లేస్తానన్నావ్. ఇప్పుడు చూడు టైమెంతైందో'' నీరజని పట్టి కుదుపుతూ అన్నది సుమిత్ర. గంట కొట్టినట్టు వినిపించిన తల్లి అరుపునకు నిద్రమత్తు వదిలిపోయింది నీరజకి.

బద్ధకంగానే బ్రష్ చేసుకుని చదువుకోవడానికి ఉపక్రమించింది నీరజ. ఆరోజు ఫిజిక్స్ మేడం టెస్ట్ పెడతానన్నారు. అన్నీ వచ్చిన లెసన్సే అయినా మళ్ళీ తీసి చదవడం మొదలుపెట్టింది.

''ఏం పిల్లలో ఏమో నిద్ర లేచాక దుప్పటి కూడా మడత వెయ్యరు. అన్నీ అమ్మే చూసుకొంటుందిలే అనే ధీమా! ఎంత చదువుకుంటే మాత్రం ఏం లాభం? తల్లికి ఆమాత్రం సాయం చెయ్యాలనే జ్ఞానం లేనప్పుడు''

పుస్తకం ముందేసుకున్న నీరజకి బెడ్ రూంలోంచీ తల్లి సాధింపు వినిపిస్తూనే వుంది.

తల్లి అన్నదీ నిజమే. తనకీ తల్లికి సాయం చెయ్యాలనే ఉంటుంది. అలాగని ఎప్పుడైనా సాయం చేయబోయినా నీకెందుకే ఇవన్నీ పో..పోయి చదువుకో అంటుంది. మళ్ళీ తనే నీకు ఏ పనీ చేతకాదంటుంది. ఎలా అర్థం చేసుకోవాలి అమ్మని అని ఆలోచిస్తుండగానే-

''నీరూ ఇదుగో ఈ హార్లిక్సు తాగేసి చదువుకో'' టేబుల్ మీద హార్లిక్స్ గ్లాసు ఉంచుతూ అన్నది సమిత్ర.

''అబ్బా ఈ హార్లిక్సంటేనే నాకు వాంతొచ్చినట్టుంటుంది. కాఫీ ఇవ్వరాదూ'' మొహం అదోలా పెట్టి అన్నది నీరజ.

''నీలాటి చదూకునే పిల్లలు హార్లిక్సే తాగాలి''

''కానీ నాకిష్టం లేనిదే ఎలా తాగను మమ్మీ''

''చూడు నీరూ మనకిష్టమైనవన్నీ మనకి మేలు చెయ్యవు. మనకి మేలు చేసేవన్నీ మనకిష్టం ఉండకపోవచ్చు. అయినా చిన్నపిల్లవి ఇప్పట్నించే నీకు కాఫీ ఏంటి? హార్లిక్స్ తాగి బుద్ధిగా చదువుకో'' కోపంగా అన్నది సుమిత్ర.

''నేనేం చిన్నపిల్లని కాదు. ఇంటర్లోకొచ్చాను. నాకూ ఇష్టా ఇష్టాలుంటాయి'' విసుగ్గా అన్నది నీరజ. తల్లి తనని మరీ చిన్నపిల్లని చేసి మాట్లాడడం నీరజకి ఇష్టం ఉండదు.

''ఔనే నువ్వు చాలా పెద్దదానివయిపోయావు. ఆ సంగతి తెలుసుకోలేక నువ్వింకా చిన్నపిల్లవే అనుకుంటున్నాను నేను. రేపట్నించి రెండు పూట్లా కాఫీనే తాగుదువుగాని'' గట్టిగా, కోపంగా అన్నది సుమిత్ర.

''అబ్బా పొద్దున్నే మొదలైందా ఇద్దరికీ గొడవ'' అప్పుడే అక్కడికి వచ్చిన రామక్రిష్ణ అన్నాడు.

''చూడు డాడీ మమ్మీ అన్నీ తను చెప్పినట్టే వినాలంటుంది'' తండ్రి వంక చూస్తూ కంప్లెయింట్ చేస్తున్నట్టుగా అన్నది నీరజ.

''సరేలే రోలొచ్చి మద్దెలతో మొరపెట్టుకుందిట. అయినా మమ్మీతో గొడవ పడడం మనకస్సలు మంచిది కాదు నీరూ..కనుక నువ్వు హాయిగా హార్లిక్స్ తాగేసి బుద్ధిగా చదువుకో తెలిసిందా'' కూతురికి హితబోధ చేసి రుసరుస లాడుతున్న భార్యవంక చూసి నవ్వుతూ '' సుమీ..నాకు ఓ కప్పు అమృతం కావాలిరా'' అన్నాడు.

''అమృతమా? అదెలా చేస్తారు డాడీ'' అన్నది చిన్నకూతురు రమ్య.

''అంటే మీ మమ్మీ చేత్తో కలిపే కాఫీ అమృతంలా ఉంటుందని అర్థం'' అన్నాడు రామక్రిష్ణ.

''కాఫీకోసం అంతలా కాకా పట్టక్కర్లేదు కలిపిస్తానుండండి'' వంటింట్లోకి దారితీస్తూ అన్నది సుమిత్ర.

''ఏమిటోయ్ పొగిడినా కోపమేనా? అందమైన నీ ముఖానికి చిరునవ్వు ఆభరణం తగిలించి చూడు నీ అందం మా ఆనందం రెట్టింపవుతుంది'' భార్య వెనకాలే వంటింట్లోకి వస్తూ అన్నాడు రామక్రిష్ణ.

''నా మొహానికి చిరునవ్వొక్కటే తక్కువ'' నిరాశగా అంటున్న భార్య భుజం చుట్టూ చేతులేసి దగ్గరగా తీసుకున్నాడు రామక్రిష్ణ.

''నీ బాధేమిటో నాకు చెప్పరా ప్లీజ్..ఎందుకలా ఎపుడూ విసుగ్గా టెన్షన్‌గా ఉన్నట్టుంటావు'' అనునయంగా అన్నాడు.

''ఏమండీ మీ ఫ్రెండ్ రామనాథం లేడూ వారం రోజులు శెలవుపెట్టి ఫ్యామిలీని తిరుపతి, బెంగుళూరూ తిప్పి తీసుకొచ్చాడుట. వాళ్ళు భలే ఎంజాయ్ చేశారటండీ'' అర్థమైంది రామక్రిష్ణకి.

''అయితే మనమూ వెళ్ళాలంటావు''

సుమిత్ర ఆశగా చూసింది భర్తవంక.

''నువ్వు చెప్పినట్టు ఎటైనా తిరిగొస్తే హాయిగానే ఉంటుంది. కానీ..నాకు ఇప్పుడు శెలవు దొరకడం చాలా కష్టం. పోనీ నా సంగతి ఎలా ఉన్నా పిల్లలకి పరీక్షలు దగ్గర పడుతున్నాయి. ఇలాటప్పుడు ఇల్లు కదలడం భావ్యమా చెప్పు'' నచ్చ చెప్పబోయాడు రామక్రిష్ణ.

''అనుకున్నాను మీరిలా అంటారని. మీకెప్పుడూ శెలవు దొరకదు. అక్కడికి మీరొక్కరేనా సిన్సియర్‌గా పనిచేస్తున్నది. మీ ఫ్రెండు రామనాథానికి శెలవెలా దొరికింది? వాళ్ళమ్మాయి మాత్రం మనమ్మాయి క్లాస్‌మేట్ కాదా? అంత డబ్బు ఖర్చు చేసి తిరిగి రావడం మీకిష్టం లేదని చెప్పండి. మిమ్మల్ని ఇంకెప్పుడూ అడగనే అడగను.''

రామక్రిష్ణ నిట్టూర్చాడు.

''సుమీ ఏం చెప్పను? ఆ రామనాథం ప్రతి ఏడూ తిరుపతి వెడతాడు. అందరికీ లడ్డూ ప్రసాదం పంచుతాడు. అందరితో మంచిగా ఉన్నట్టే కనిపిస్తాడు.

నీకు తెలియని విషయమేమిటో తెలుసా? బాగా లంచాలు తీసుకుంటాడు. శెలవు కోసమని వాళ్ళ వాళ్ళకి సీరియస్‌గా ఉందని ఆఫీసుకి దొంగ టెలిగ్రాములు తెప్పించుకుంటాడు. నాకు అలా అబద్ధాలు చెప్పి శలవు పెట్టడం చేతకాదు మరి. ఇంక వాళ్ళమ్మాయి చదువు ఎలా ఉంటుందో మనమ్మాయి నడుగు.''

''డాడీ చెప్పింది నిజమే మమ్మీ. రామనాథం అంకుల్ వాళ్ళమ్మాయి చాలా డల్ కేండిడేట్. చదువుకన్నా ఫ్యాషన్స్, సినిమాలు అంటేనే ఎక్కువ ఇంట్రస్టు దానికి'' అన్నది అక్కడికొచ్చిన నీరజ.

''చాల్లే పిల్లికి ఎలక సాక్ష్యం అన్నట్టు మీ డాడీకి వంత పాడడానికొచ్చావు'' విసుక్కుంది సుమిత్ర.

''నేనేమీ మీ కబుర్లు వింటూ కూర్చోవడానికి రాలేదు. నాకు జడెయ్యి టైమైపోతోంది'' అన్నది

నీరజ.

''ఇంటర్లోకొచ్చావు. ఆమాత్రం జడేసుకోవడం రాకపోతే ఎలా...నీ ఈడు పిల్లలు చూడు..ఎన్ని పనులు చక్కబెడతారో'' కూతుర్ని విసుక్కుంటూనే తలకి నూనె రాసి జడవేసింది సుమిత్ర.

''మమ్మీ స్నానానికి నీళ్ళు పెట్టు'' చిన్న కూతురు రమ్య కేకేసింది.

''వస్తున్నా తల్లీ..తప్పుతుందా'' కూతురికి బాత్రూంలో వేడినీళ్ళు పెట్టి వచ్చింది సుమిత్ర.

''చూశారా! మీ చిన్న కూతురు. టెన్త్‌లోకొచ్చింది. స్టవ్ మీద నుండి నీళ్ళగిన్నె దింపడం చాత కాదు. ఆ వయసప్పుడు నేను వంట కూడా చేసే దాన్ని.''

''నువ్వు అలవాటు చేసినదేగా మరి. వాళ్ళ సంగతి వదిలెయ్యి- పోనీ నా పనులు కూడా నన్ను చేసుకోనివ్వవు. మంచినీళ్ళ గ్లాసు కూడా అందిస్తావు. ఇకనుంచైనా కనీసం మా పనులు మమ్మల్ని చేసుకోనివ్వు'' అన్నాడు రామక్రిష్ణ.

''వద్దులెండి...మీకూ, పిల్లలకి చేసే పనిలో దొరికే తృప్తి నాకు ఇంక దేంట్లోనూ దొరకదు. ఎప్పుడో ప్రాణం విసిగినప్పుడు ఏదేదో అంటాను. కానీ మీరు పనులు చేస్తే నేను చూడలేను.''

''నాకు తెలీదా సుమీ నీ మనస్తత్వం'' భార్య వంక ప్రేమగా చూస్తూ అన్నాడు రామక్రిష్ణ.

''మమ్మీ లంచ్ బాక్స్ సర్దావా'' అంటూ వచ్చింది నీరజ.

''సర్దాను. ఇవాళ నీకిష్టమైన బిరియాని పెట్టాను లంచ్ బాక్స్‌లో'' చెప్పింది సుమిత్ర.

''పొద్దున్నే వంటింట్లోంచి కమ్మని వాసన వస్తున్నప్పుడే అనుకున్నాను. నువ్వివాళ ఏదో స్పెషల్ చేస్తున్నావని'' అన్నది నీరజ.

''నీకిష్టమైనది చేస్తే కడుపునిండా తింటావనీ లేకపోతే సాయంత్రానికి నీరసం ముఖం వేసుకొని వస్తావు''


''మమ్మీ ఫోన్. పెద్దమ్మ చేసింది. నిన్ను పిలుస్తోంది'' హడావిడిగా వచ్చింది రమ్య.

''ఆ..వస్తున్నా'' పరుగులాంటి నడకతో వెళ్ళి ఫోన్ కాల్ రిసీవ్ చేసుకుంది సుమిత్ర. ఓ పది నిమిషాలు మాట్లాడిన తరువాత వెలిగిపోతున్న మొహంతో వచ్చింది సుమిత్ర.

''ఏమిటి సుమీ అంత హాపీగా ఉన్నావు''

భర్త ప్రశ్న పూర్తికాకుండానే ''ఏమండీ మా అక్కయ్య కూతురికి పెళ్ళి కుదిరిందట. ఇంకో నాల్రోజుల్లో ఎంగేజ్‌మెంట్ ఫంక్షన్‌ట. మనందర్నీ ఫంక్షన్‌కి తప్పకుండా రమ్మందండీ మా అక్కయ్య'' భర్తవంకే ఆశగా చూస్తూ అన్నది సుమిత్ర.

''ఈసారికి వీలుకాదని చెప్పెయ్'' కొద్దిగా సీరియస్‌నెస్ తెచ్చిపెట్టుకున్న ముఖంతో అన్నాడు రామక్రిష్ణ.



''అంటే ఈ ఎంగేజ్‌మెంట్‌కి రాము. నీ కూతురికి మళ్ళీ ఎంగేజ్‌మెంట్ చేసినప్పుడు వీలుచూసుకుని వస్తామని చెప్పాలా'' ఇంకా సీరియస్‌గానే అన్నది సుమిత్ర.

పెద్దగా నవ్వేశాడు రామక్రిష్ణ ''ఊ..నీకూ జోకులు బాగానే వస్తున్నాయి. ఇది ఎంగేజ్‌మెంటే కదా..అంటే పెళ్ళి ముందు చేసే ఓ చిన్న ఫంక్షన్ అంతే! దీనికోసం ఇప్పుడు అంత దూరం వెళ్ళడం అవసరమా చెప్పు. పెళ్ళంటే ఎలాగూ వెళ్ళక తప్పదు'' అనునయంగా అన్నాడు రామక్రిష్ణ.

**ఆదుర్తి బాల**

''మా బావ చాలా దర్జామనిషండీ. ఖర్చులకి చూసుకోడు మీలాగా. ఎంగేజ్‌మెంట్ కూడా పెళ్ళంత ఆర్భాటంగా చేస్తాడు'' గొప్పగా అన్నది సుమిత్ర.

''చూడు సుమీ లోకో భిన్నరుచి అన్నారు. ఈ లోకంలో ఒకరికి ఇష్టమైనది ఇంకొకరికి ఇష్టం ఉండకపోవచ్చు. కొందరికి ఆర్భాటం ఇష్టం, కొందరికి సింపుల్‌గా ఉండడం ఇష్టం. ఎవరి పద్ధతి వారికి సరైనదిగా కనిపించవచ్చు. కానీ ఒకరితో ఒకరిని కంపేర్ చేయడం తప్పు''

''తప్పయింది మహాప్రభో..ఇంకెప్పుడూ మిమ్మల్ని మా బావగారితో కంపేర్ చెయ్యను'' లెంపలు వేసుకుంటూ అన్నది సుమిత్ర.

''సరే ఈ తప్పుకి పరిహారం రాత్రి చెల్లిద్దువు గాని..నేనింక ఆఫీసుకి బయల్దేరాలి'' నవ్వుతూ అన్నాడు రామక్రిష్ణ.

★ ★ ★

అందరూ బయటికి వెళ్ళిపోయాక వంటరిగా మిగిలిపోయింది సుమిత్ర. అక్కయ్య కూతురి ప్రధానం కార్యక్రమానికి ఎలాగైనా వెళ్ళాలనిపిస్తోంది సుమిత్రకి. భర్తకీ, పిల్లలకీ వీలు కాకపోతే తనొక్కర్తీ అయినా వెళ్ళి రావాలని నిశ్చయించుకుంది.

ఆ రాత్రి భర్త దగ్గర ప్రయాణం ప్రస్తావన తెచ్చింది కానీ అతడు సుముఖత చూపకపోవడంతో నిరాశపడింది సుమిత్ర.

★ ★ ★

''సుమీ'' భోజనం వడ్డిస్తున్న భార్యని పిలిచాడు రామక్రిష్ణ.

''.....''

''నామీద కోపం వచ్చింది కదూ మాట్లాడడం మానేశావు''

''కోపం తెచ్చుకుని నేను మాత్రం చేయగలిగేదేముంది'' ముభావంగా అన్నది సుమిత్ర.

''అలా నిరాశగా మాట్లాడకు సుమీ..నే చెప్పేది విను. నాకూ పిల్లలకీ ఇప్పుడు కుదరదని నీకొక్కర్తికీ హైదరాబాద్‌కి టికెట్ రిజర్వ్ చేయించాను.''

ఆశ్చర్యంగా, ఆనందంగా చూసింది సుమిత్ర.

''నమ్మలేవా సుమీ..హేంగర్‌కున్న నా షర్ట్ జేబులో చూడు.

ఓ నాలుగు రోజులపాటు మేం ఎలాగో తంటాలు పడతాంలే. నువ్వు మీ అక్కావాళ్ళింట్లో హాయిగా గడిపిరా. నీక్కూడా ఈ రొటీన్ నుంచి రిలాక్సింగ్‌గా ఉంటుంది'' అంటున్న భర్తమాటలకి సుమిత్ర మనసు ఆనందంతో పొంగిపోయింది. ఆ రోజు రాత్రికే బయలుదేరాల్సి ఉండడంతో హడావిడిగా బట్టలు సర్దుకుంది.

ఆరోజు రామక్రిష్ణ త్వరగా వచ్చేశాడు ఆఫీసు నుంచీ.

''నేను వచ్చేవరకూ హోటల్ నుండీ కారియర్ తెచ్చుకుంటారా''

ప్రయాణానికి అన్నీ సర్దుకోవడం అయ్యాక భర్తని అడిగింది సుమిత్ర.


''అఖ్ఖర్లేదు మమ్మీ హోటల్ భోజనం అంటే ప్లేటు నలభై రూపాయలకి తక్కువ ఉండదు. మా ముగ్గురికీ రోజుకి నూట ఇరవై అంటే చాలా ఎక్కువ కదూ. నాకు అన్నం వండడం వచ్చు. నువ్వు చేసిన ఊరగాయలు ఎలానూ ఉన్నాయి కదా! వాటితో కాలక్షేపం చేసేస్తాంలే'' అన్నది పెద్ద కూతురు నీరజ.

''నీ అంత బాగా రాకపోయినా నాకూ కాఫీ కలపడం వచ్చు మమ్మీ. డాడీకి నేను కాఫీ కలిపిస్తాలే'' భరోసా ఇచ్చింది చిన్నకూతురు.

''నువ్వు లేకపోతే మాకు ఇబ్బందే కానీ ఎలాగోలాగు మేం మేనేజ్ చేసుకుంటాలే. మా గురించి ఊరికే బాధపడకు'' ధైర్యం చెప్పాడు రామక్రిష్ణ.

సుమిత్ర మనసంతా ఏదోలా అయిపోయింది. ఇంతమందిని ఇబ్బందికి గురిచేసి తనిప్పుడు ఆ ఫంక్షన్‌కి వెళ్ళకపోతేనేం అనిపించింది.

అసలు తనెప్పుడు తనది నాలుగు గోడల మధ్య బందీ అయిన జీవితం, రొటీన్ లైఫ్ అని అనుకుంటూ తన గురించే ఆలోచిస్తూ బాధపడుతుంది కానీ పాపం పిల్లల స్కూళ్ళూ, కాలేజీలూ వారి చదువులూ అవి మాత్రం వాళ్ళకి రొటీన్ కాదా.



ఇప్పటి చదువులకి పిల్లలెంతగా నలిగిపోతున్నారూ పాపం. వారి సమస్యలు వారికుండవా? తన సంతోషం కోసం వీళ్ళు ఇంటి పని చేసుకునే అదనపు బాధ్యతని తీసుకుంటున్నారు.

కానీ...తను? రిలాక్స్ అవాలంటూ తల్లిగా, భార్యగా తన బాధ్యత నుండీ దూరంగా వెళ్ళాలనుకుంటోంది.

ఇలా ఆలోచించాక సుమిత్రకి ఫంక్షన్‌కి వెళ్ళాలనిపించలేదు.

''ఏమండీ టికెట్ కాన్సిల్ చేయండి'' భర్తతో అన్నది.

''ఏమైంది సుమీ..''

భార్య ఆలోచనని అర్థం చేసుకుని అడిగాడు రామక్రిష్ణ.

''మీ అందర్నీ ఇలా వదిలేసి నే వెళ్ళలేనంతే.

ఈ బాధ్యతలు కనిపించని సంకెళ్ళండీ..

వీటిని తెంచుకొని నేను వెళ్ళలేను'' అన్నది సుమిత్ర.

తన కుటుంబం సుఖసంతోషాల కోసం తన ఇష్టాయిష్టాలనీ, సంతోషాలనీ త్యాగం చెయ్యడమే ఇల్లాలి గొప్పతనమేమో అనిపించింది రామక్రిష్ణకి.

---

## గుణపాఠం

**'జీవితంలో మనకి తెలియకుండానే కొన్ని తప్పులు జరిగిపోతుంటాయి. మనకి తెలిసీ తప్పులు చేయడం మంచిదికాదు. పొరపాట్ల నుంచి గుణపాఠం నేర్చుకుని మెరుగైన భావి జీవితానికి బాటలు వేసుకోవాలి' అంటున్నారు డాక్టర్ రాజశేఖర్. విలన్ చిత్రంతో జనం ముందుకి వచ్చిన రాజశేఖర్ తన ఖాళీ సమయాన్నంతా సినిమాలు చూడడానికి, పుస్తకాలు చదవడానికి వినియోగిస్తానని చెబుతున్నారు. స్విట్జర్లాండ్‌లోని సుందరమైన ప్రదేశాల్ని బాగా ఎంజాయ్ చేసే రాజశేఖర్ తనకున్న ఆకస్మిక కోపం మైనస్ పాయింట్ అంటారు. హాలీవుడ్‌లోని మెల్‌గిబ్సన్ తన అభిమాననటుడుగా చెప్పుకునే ఈ విలన్‌కి చైనీస్ ఫుడ్ అంటే ఎంతో ఇష్టంట.**